
ఆలయ కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

ప్రజలంతా సంతోషంగా ఉండాలి: ఎమ్మెల్యే

గాజులరామారం, జూలై 2(ఆంధ్రజ్యోతి): అమ్మవారి కృపతో ప్రజలంతా సంతోషంగా ఉండాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. సూరారం డివిజన్ నెహ్రూనగర్‌లోని జగదాంబ మాతా సేవాలాల్‌మహారాజ్ దేవాలయంలో నిర్వహించిన బోనాల ఉత్సవాలకు ఆయన హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనాదిగా వస్తున్న పండుగలను సుఖసంతోషాలతో జరుపుకోవాలని కోరారు. అమ్మవారు ప్రజలకు అష్టైశ్వర్యాలు ఇవ్వాలని ఎమ్మెల్యే కోరుకున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, నిజాంపేట్ కార్పొరేటర్ ఆగం రాజు, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పి.భాస్కర్, పోలె శ్రీకాంత్, ప్రభుదాస్, ఫిరోజ్, ఆలయ కమిటీ సభ్యులు దశరథ్, జగన్, శంకర్, మంగ్యలాల్, రవి, స్వామి పాల్గొన్నారు.

నిరుపయోగంగా ఎలక్ట్రికల్ రీచార్జ్ స్టేషన్


జోనల్ కార్యాలయంలో పనిచేయని ఎలక్ట్రికల్ రీచార్జ్ స్టేషన్

గచ్చిబౌలి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ఎలక్ట్రికల్ రీచార్జ్ స్టేషన్ అలంకారప్రాయంగా మారింది. జీహెచ్ఎంసీ అధికారులు ప్రభుత్వ ఆదేశాలతో హడావిడిగా ఏర్పాటు చేశారు. అనంతరం దాని నిర్వహణను అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నిర్వహణ పూర్తిగా గాలికి వదిలేశారు. రాష్ట్ర ప్రభుత్వం జీహెచ్ఎంసీ పరిధిలో కాలుష్య రహిత వాహనాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలనే సంకల్పంతో ఈ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కేవలం నిర్వహణ లోపం కారణంగానే ఈ రీచార్జ్ స్టేషన్ పనిచేయడం లేదని వాహనదారులు వాపోతున్నారు. మంగళవారం ఇద్దరు వాహనదారులు జోనల్ కార్యాలయంలో ఉన్న రీచార్జ్ కేంద్రానికి వచ్చి తమ వాహనాలకు రీచార్జ్ చేస్తుండగా అది పని చేయలేదు. దీంతో అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చినా ఫలితం లేకపోవడంతో వారు వెనుతిరిగి వెళ్లిపోయారు. ఎలక్ట్రికల్ రీచార్జ్ కేంద్రానికి మరమ్మతులు చేయాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.

జోనల్ కమిషనర్‌ను కలిసిన కార్పొరేటర్ రాగం


ఉపేందర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం ఇస్తున్న రాగం నాగేందర్‌యాదవ్

గచ్చిబౌలి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డిని కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలో నెలకొన్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించినట్లు కార్పొరేటర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మోహన్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వైద్యులకు సన్మానం


వైద్యులను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

గచ్చిబౌలి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ వైద్యుల దినోత్సవం పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పలువురు వైద్యులను మంగళవారం ఘనంగా సన్మానించారు. లింగంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులను లయన్స్‌క్లబ్ ప్రతినిధులు సన్మానించి వారి సేవలను కొనియాడారు. వైద్యులను సన్మానించుకోవడం అదృష్టంగా భావిస్తున్నట్లు లయన్స్‌క్లబ్ ప్రతినిధులు తెలిపారు. లయన్స్‌క్లబ్ రీజియన్ చైర్మన్ కరుణాకర్‌గౌడ్, జోనల్ చైర్మన్ కొండా విజయ్‌కుమార్, శేరిలింగంపల్లి అధ్యక్షుడు ప్రసాద్, కార్యదర్శి లక్ష్మీనారాయణగౌడ్, కోశాధికారి జనార్దన్‌రెడ్డి, అశోక్‌గౌడ్, లత పాల్గొన్నారు.


డీసీ రమేష్, అధికారులు, సిబ్బందితో సమావేశంలో బండి రమేష్

ప్రజాసమస్యలపై అధికారులు త్వరగా స్పందించాలి

అల్లాపూర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై త్వరగా స్పందించాలని అధికారులకు కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ మంగళవారం సూచించారు. నిధులు అవసరమైన చోట కాస్త ఆలస్యమైనా, నిధులతో పనిలేని వాటిని సత్వరమే పరిష్కరించాలన్నారు. అల్లాపూర్ డివిజన్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో బండి రమేష్ జీహెచ్ఎంసి మూసాపేట్ డీసీ రమేష్, టౌన్ ప్లానింగ్ విభాగం, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. ప్రధానంగా టౌన్ ప్లానింగ్ విభాగంపై విమర్శలు వెల్లువెత్తాయి. మాజీ కార్పొరేటర్ సయద్‌బాబు మాట్లాడుతూ.. పాండురంగ నగర్‌లో వంద ఫీట్ల రోడ్డు స్థలంలో భవన నిర్మాణానికి అనుమతి ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. సఫ్దర్‌నగర్ చెరువు నాలాను బస్తీలోకి మళ్లించటంతో ఇళ్లలోకి చెరువునీరు చేరుతోందని, దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని గుర్తు చేశారు. అన్ని సమస్యలు పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. తూము వేణు, మొయినుద్దీన్, లక్ష్మయ్య, విఠల్‌రెడ్డి, జమీర్ పాల్గొన్నారు.

'భయపడొద్దు.. డబ్బులు ఎవరికీ ఇవ్వొద్దు'

కేపీహెచ్‌బీకాలనీ, జూలై 2 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీ మూడోఫేజ్‌లో ఎల్ఐజీ, ఎంఐజీ ప్లాట్ల నిర్మాణ విషయంలో కాంగ్రెస్ నాయకులు వసూళ్లకు పాల్పడుతున్నారని బీజేపీ నాయకులు ప్రీతంరెడ్డి ఆరోపించారు. ఒక్కో ఫ్లాట్‌కు రూ.50 వేలు ఇస్తారా ? లేదంటే జీహెచ్ఎంసీ అధికారులకు చెప్పి ఇళ్లను కూల్చివేయించమంటారా? అని బెదిరిస్తున్నారని ప్రీతంరెడ్డి దృష్టికి తేవడంతో మంగళవారం స్థానిక నాయకులతో కలిసి అక్కడికి చేరుకొని నివాసితులతో మాట్లాడారు. ఇంకోసారి ఎవరైనా డబ్బులు అడిగితే సదరు వ్యక్తులపై కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్, మూసాపేట్ సర్కిల్ కార్యాలయంలో రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తామని హెచ్చరించాడు.


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేవైఎం నాయకులు

కాంగ్రెస్‌కు కొమ్ముకాస్తున్న కమ్యూనిస్టు విద్యార్థి సంఘాలు

హైదర్‌నగర్, జూలై 2(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలను పట్టించుకోకుండా కమ్యూనిస్టు విద్యార్థి సంఘాలు కాంగ్రెస్ ప్రభుత్వానికి కొమ్ముకాస్తున్నాయని బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుమార్‌యాదవ్ ఆరోపించారు. రాష్ట్రంలో నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని బీజేవైఎం ఆధ్వర్యంలో కూకట్‌పల్లి తహసీల్దార్‌కి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రూప్-1 విషయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం 1:100 ప్రకారం మెయిన్ ఎగ్జామ్‌కి అభ్యర్థుల అర్హత పెంచాలన్నారు. డీఎస్సీ పరీక్షల తేదీలను వాయిదా వేసి మెగా డీఎస్సీ ప్రకటించాలన్నారు. అమర్నాథ్‌యాదవ్, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్‌చారి, హరిప్రసాద్, సాయికుమార్ పాల్గొన్నారు.

దొంగతనం కేసులో పోలీసు విచారణకు వచ్చి..

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

దుండిగల్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): దొంగతనం కేసులో ఓ యువకుడిని పోలీసులు విచారణకు పిలిచారు. వారు కొడతారనే భయంతో ఆ యువకుడు పోలీస్‌స్టేషన్‌కు కొద్దిదూరంలో గుర్తు తెలియని విషం తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి సీఐ ఉపేందర్ వివరాలు వెల్లడించారు. బాచుపల్లి రాజీవ్‌గాంధీనగర్‌లోని జయదీపిక ఎన్‌క్లేవ్ లో మహబూబ్ జాని నివాసం ఉంటున్నాడు. తన ఇంట్లో రూ.5 లక్షల విలువైన బంగారు నగలు ఒక చైన్, నక్లెస్, బంగారం జత చెవికమ్మలు, గతనెల 16న దొంగిలించబడినాయని బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇంట్లో పనిచేసే మహిళ చిత్తారపు లక్ష్మిపై అనుమానం వ్యక్తం చేశాడు. కేసు విచారణలో భాగంగా ఈనెల 1న సోమవారం చిత్తారపు లక్ష్మిని మహిళా పోలీసుల సమక్షంలో విచారించారు. విచారణలో దొంగిలించిన సొత్తు తన ఆడ పడుచు భర్త రాజేష్‌కు ఇచ్చినట్లు ఆమె తెలిపింది. దీంతో రాజేష్‌ను పోలీసులు విచారించేందుకు స్టేషన్‌కు పిలిచారు. స్టేషన్‌కు వస్తున్న సమయంలో రాజేష్ గుర్తు తెలియని విషం తాగాడని, విషయం గమనించిన పోలీసులు వెంటనే ఆస్పత్రికి తరలించి చికిత్స అందించినట్లు తెలిపారు. ప్రస్తుతం రాజేష్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.


చికిత్స పొందుతున్న రాజేష్, ఫిర్యాదు నమోదు చేసుకోవడానికి వచ్చిన మహిళా పోలీసు

పోలీసులు చేయిచేసుకున్నారు.. బెదిరించారు : బాధితురాలు లక్ష్మి

బాచుపల్లిలోని రాజీవ్‌గాంధీనగర్ జయదీపిక ఎన్‌క్లేవ్‌లో ఉంటున్నామని, తాను ఇళ్లలో, తన భర్త వాచ్‌మెన్‌గా పని చేస్తున్నట్లు బాధితురాలు లక్ష్మి తెలిపింది. తాను పని చేసే ఇంట్లో బంగారు ఆభరణాలు పోయాయని యజమాని ఫిర్యాదు చేశాడని, బాచుపల్లి పోలీసులు విచారణ కోసం పిలిచి తనపై చేయి చేసుకున్నారని వాపోయింది. దొంగిలించిన బంగారం తీసుకురావాలని బెదిరించినట్లు తెలిపింది. దొంగతనం చేసినట్లు అంగీకరించాలని పోలీసులు ఒత్తిడి తీసుకురావడంతో చివరకు ఒక చైన్ దొంగిలించి ఆడపడుచు భర్త రాజేష్‌కు ఇచ్చినట్లు అంగీకరించానని తెలిపింది. ఈనెల 1న చైన్ తీసుకువచ్చి పోలీసులకు అప్పగించానని, ఆ చైన్ తనది కాదని ఇంటి యజమాని చెప్పడంతో పోలీసులు చైన్‌ను తిరిగి తనకు ఇచ్చారని తెలిపింది. ఈ కేసుకు సంబంధించి రాజేష్‌ను పోలీస్‌స్టేషన్‌కు రావాలని మంగళవారం పోలీసులు బెదించారని, వారి బెదిరింపులకు భయపడి రాజేష్, అతని భార్య సుధ ఇద్దరు కలిసి పోలీస్‌స్టేషన్‌కు బయలుదేరినట్లు తెలిపింది. అయితే భయాందోళనలకు గురైన రాజేష్ పోలీస్టేషన్‌కు కూతవేటు దూరంలో విషం తాగి కింద పడిపోయాడని, గమనించిన రాజేష్ భార్య పోలీసుల సాయంతో ఆస్పత్రికి తీసుకెళ్లినట్లు ఆమె వివరించింది.

అండర్‌టేకింగ్ ఇస్తే లోపాలన్నీ సరి!

- ఇంజనీరింగ్ కాలేజీల అఫిలియేషన్లకు జేఎన్‌టీయూ లైన్ క్లియర్
- కంప్యూటర్ సైన్స్ కోర్సుల్లో ఈ ఏడాదికి సీట్ల పెంపు లేనట్లే..

హైదరాబాద్ సిటీ, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఎప్‌సెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ రేపటినుంచి ప్రారంభం కానుండడంతో, త్వరితగతిన అఫిలియేషన్ ప్రక్రియ పూర్తిచేసే పనిలో జేఎన్‌టీయూ ఉన్నతాధికారులు నిమగ్నమయ్యారు. డెఫిషియన్సీ ఉన్న కళాశాల యాజమాన్యాలు అండర్ టేకింగ్ ఇస్తే సరిపోతుందంటూ.. సోమవారం రాత్రి వర్సిటీ రిజిస్ట్రార్ సర్క్యులర్ జారీ చేశారు. ఆరునెలల్లోగా తమ కాలేజీల్లో ప్రిన్సిపాల్స్, ఫ్యాకల్టీ కొరతను అధిగమిస్తామని, లేనిపక్షంలో జేఎన్టీయూ అధికారులు చర్యలు చేపట్టవచ్చనే విధంగా రూపొందించిన ఫార్మట్‌ను సర్క్యులర్‌కు జతచేశారు.

● రూ.100బాండ్ పేపర్లపై అండర్ టేకింగ్

రూ.100ల బాండ్‌పేపర్‌పై కళాశాల చైర్మన్, సెక్రటరీల సంతకాలతో మంగళవారం సాయంత్రం 4గంటల్లోగా అండర్‌టేకింగ్ పత్రాలను సమర్పించాలని సూచించారు. జేఎన్‌టీయూ అధికారులు ఇచ్చిన వెసులుబాటుతో ఊపిరిపీల్చుకున్న ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యాల ప్రతినిధులు ఆగమేఘాల మీద యూనివర్సిటీకి వచ్చి అండర్‌టేకింగ్ పత్రాలు సమర్పించారు. అయితే.. వర్సిటీ అధికారులు పేర్కొన్న లోపాలను అండర్‌టేకింగ్‌లో ప్రస్తావించకుండా, కొన్ని కాలేజీల యజమాన్యాలు తమకు ఫ్యాకల్టీ కొరత అంతగా లేదంటూ సమర్పించిన అఫిడవిట్లను జేఎన్‌టీయూ అధికారులు తిరస్కరించారు. మొత్తంగా 139 కాలేజీల్లో 122 కాలేజీలకు అఫిలియేషన్ మార్గం సుగమం అయినట్లు తెలిసింది. మరో 17 కాలేజీలు అండర్‌టేకింగ్ పత్రాలు సమర్పించేందుకు బుధవారం వరకు గడువు కోరినట్లు తెలిసింది.

● ఈ ఏడాదికి సీఎస్ఈ సీట్ల పెంపు లేనట్లే!

ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో ఈ విద్యా సంవత్సరంలో బీటెక్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(సీఎస్ఈ) కోర్సుల్లో సీట్ల పెంపులేనట్లేనని జేఎన్టీయూ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. అయితే, డిమాండ్ ఉన్న సీఎస్ఈ కోర్సుల్లో దాదాపు అన్ని కళాశాలలు ఈ ఏడాది పెద్దమొత్తంలో సీట్ల పెంపునకు ఏఐసీటీఈ నుంచి అనుమతి తెచ్చుకున్నాయి. కాగా, ఇటీవల జేఎన్‌టీయూ నిర్వహించిన ఎఫ్ఎఫ్‌సీ తనిఖీల్లో ఆయా కాలేజీల్లో ప్రిన్సిపాల్స్, ఫ్యాకల్టీ కొరత స్పష్టంగా వెల్లడి కావడంతో సీట్ల పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం విముఖత చూపుతున్నట్లు సమాచారం. మరోవైపు కోర్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌లైన సివిల్, మెకానికల్ కోర్సుల్లో సీట్లను తగ్గించుకున్న కాలేజీలు, అదే సంఖ్యలో సీఎస్ఈ సీట్లను పెంచాలని చేసిన విజ్ఞప్తిని కూడా విద్యాశాఖ ఉన్నతాధికారులు తోసిపుచ్చినట్లు తెలిసింది. దీంతో ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో గతేడాది ఎన్ని సీట్లు ఉన్నాయో, ఈ విద్యా సంవత్సరం కూడా అదే ఇన్‌టేక్‌తో కౌన్సెలింగ్ వెళ్లకతప్పదం లేదని కళాశాలల యాజమాన్యాల సంఘం ప్రతినిధి ఒకరు పేర్కొన్నారు.

నీట్ లీకేజీపై విచారణ జరిపించాలి


అభివాదం చేస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ నేతలు

రాంనగర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): నీట్ పరీక్షను రద్దు చేసి, సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి ద్వారా న్యాయవిచారణ జరిపించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నీట్ పరీక్షా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ వి ద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గొడుగు మహేష్‌యాదవ్ ఆధ్వర్యంలో అఖిలపక్ష విద్యార్థి సంఘాల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ నీట్‌పరీక్ష నిర్వహించిన ఏజెన్సీని రద్దు చేయాలని, ప్రశ్నపత్రాలలీకేజీలకు బాధ్యులైన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నీట్ విద్యార్థులకు న్యాయం జరిగేంతవరకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం పోరాటం చేస్తుందని ఆయన తెలిపారు.

రేపు విద్యాసంస్థల బంద్

నీట్‌పరీక్ష పత్రం లీకేజీ ఘటనలో కేంద్రంలోని బీజేపీ నేతల హస్తం ఉందని, అందుకే ప్రధాని మోదీ నోరు విప్పడం లేదని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఆరోపించారు. నీట్‌పై జాతీయస్థాయిలో ఉద్యమం కొనసాగిస్తామని హెచ్చరించారు. ఇందులో భాగంగా ఈనెల 4న ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశంలో డాక్టర్ విజయ్‌భాస్కర్, విద్యార్థి సంఘాల నాయకులు తాటికొండ విక్రమ్ గౌడ్, అరుణ్, ఆజాద్, నర్సింహనాయక్, లక్ష్మణ్, శాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాగర్‌లో ఐదెకరాల భూమి కేటాయించండి

నీటి పారుదలశాఖకు శ్రీ రామచంద్ర మిషన్ విజ్ఞప్తి

హైదరాబాద్,జూలై 2(ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్‌లో హార్ట్‌ఫుల్‌నెస్ యోగా శిక్షణ, అధ్యాత్మిక విద్యాకేంద్రానికి ఐదెకరాల భూమి కేటాయించాలని శ్రీ రామచంద్ర మిషన్ నీటిపారుదలశాఖను కోరింది. ఎకరానికి ఏడాదికి రూ.10 వేల చొప్పున పదేళ్ల కాలానికి గాను లీజుకు ఇవ్వాలని స్థానిక అధికారులకు నివేదించింది. అయితే 2012లో ప్రభుత్వ భూముల లీజులపై విడుదలైన జీవోనెం.571 ఆధారంగా ఐదెకరాలకు రూ.24.20 లక్షలను వార్షిక లీజుగా నిర్ధారించాలని స్థానిక అధికారులు ప్రతిపాదనలు పంపగా.. స్వచ్ఛంద సేవ జాబితాలో భూమిని ఎకరానికి రూ.10 వేల చొప్పున ఏడాదికి లీజుకు ఇవ్వాలని సంస్థ నివేదించింది. దాంతో దీనిపై ప్రభుత్వస్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఇప్పటికే నాగార్జున సాగర్‌లో 7289 గజాల స్థలాన్ని శ్రీ రామచంద్ర మిషన్ 1980లో లీజుకు తీసుకుంది. తాజాగా మరో ఐదెకరాల స్థలం కావాలని కోరగా, దీనిపై తగిన నిర్ణయం తీసుకోవాలని అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు.

గీతంలో ఎంబీఏ హెల్త్ కేర్ అండ్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ కోర్సు

పటాన్‌చెరు రూరల్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో ఎంబీఏ హెల్త్ కేర్ అండ్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ కోర్సును ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ మెడ్‌టెక్ జోన్ (ఏఎంటీజెడ్), అకాడమీ ఆఫ్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ (ఏహెచ్ఎ)ల సంయుక్త సహకారంతో ఈ కోర్సును ప్రారంభించినట్లు కోర్సు సమన్వయకర్త డాక్టర్ ఐ.బీ.రాజు మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో వెల్లడించారు. కోర్సు వ్యవధి రెండేళ్లు అని, 2024-25 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశాలను ప్రారంభించినట్లు తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు గీతం వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. మరింత సమాచారం కోసం గీతం వెబ్‌సైట్‌ను గానీ, 9494656677 నంబర్‌లో గాని సంప్రదించాలని కోరారు.

అంతర్జాతీయ సదస్సుకు డా.జగన్మోహన్ సిద్ధ


జగన్మోహన్‌సిద్ధ

పంజాగుట్ట, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ అలయన్స్ ఫర్ హెల్త్, ఫిజికల్ ఎడ్యుకేషన్, డాన్స్ అండ్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో జపాన్ రాజధాని టోక్యోలో జరుగనున్న రెండో ప్రపంచ కాంగ్రెస్ అంతర్జాతీయ సదస్సులో ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ జగన్మోహన్ సిద్ధ పరిశోధన పత్రాన్ని సమర్పించనున్నారు. ఈనెల 5 నుంచి 8వరకు టోక్యోలోని గాక్లెయి యూనివర్సిటీలో ఈ సదస్సు జరుగనుంది. ఈ సదస్సులో ఉస్మానియా యూనివర్సిటీ కబడ్డీ ఆటగాళ్లలో వేగాన్ని ప్లయోమెట్రిక్ ఎక్సర్‌సైజ్ ద్వారా ఎలా పెంపొందించాలనే అంశంపై ఆయన ప్రసంగించనున్నారు.

ఆరు బస్సులు.. ఐదు ఆటోలు సీజ్..!

హైదరాబాద్ సిటీ, జూలై 2 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు ఉల్లంఘిస్తోన్న వాహనాలపై చర్యలకు అధికారులు శ్రీకారం చుట్టారు. మంగళవారం నగరంలోని పలుప్రాంతాల్లో ఆర్‌టీఏ, ట్రాఫిక్ పోలీస్ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేని మూడు, అనుమతి లేని కారణంగా ఒకటి, ఇన్సూరెన్స్ సర్టిఫికెట్ లేని రెండు పాఠశాలల బస్సులతో కలిపి మొత్తం ఆరు బస్సులను సీజ్ చేశారు. పరిమితికి మించి విద్యార్థులను పాఠశాలలకు తీసుకెళ్తోన్న ఐదు ఆటో రిక్షాలు, లైఫ్‌ట్యాక్స్ చెల్లించకుండా తిరుగుతోన్న ఇతర రాష్ట్రాలకు చెందిన ఓ వాహనం, మరో ఓమ్ని బస్సును సీజ్ చేసినట్టు హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ చిదుర రమేష్ తెలిపారు.


తనిఖీలు చేస్తున్న ఆర్‌టీఏ, ట్రాఫిక్ పోలీసులు

బీరు బాటిల్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలు

- వైన్స్ నిర్వాహకులతో వాగ్వాదం
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

మెండోర రూరల్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లా మెండోర మండల కేంద్రానికి చెందిన తక్కల సాయిరెడ్డి అనే యువకుడు మంగళవారం స్థానికంగా ఉన్న వైన్స్‌లో కొనుగోలు చేసిన బీరు సీసాలో ప్లాస్టిక్ వ్యర్థాలు కనిపించాయి. దీంతో వైన్స్ నిర్వాహకుడిని నిలదీశాడు. ఆ బీరు బాటిల్ ఇస్తే మరొకటి ఇస్తానని సిబ్బంది చెప్పడంతో.. ఇలా ఎంత మందిని మోసం చేస్తారని సాయిరెడ్డి తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశాడు. ప్లాస్టిక్ వ్యర్థాలను గమనించకుండా బీరును తాగితే తమ పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. కాగా.. ఈ విషయంలో సంబంధిత అధికారులు స్పందించి ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని సాయిరెడ్డి డిమాండ్ చేశాడు.

నియోజకవర్గ అభివృద్ధి నిధుల మంజూరుకు కృషి

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అవసరమైన నిధులను మంజూరు చేయించేందుకు మంత్రుల సహకారం తీసుకొంటానని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తెలిపారు. కూకట్‌పల్లి డివిజన్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం క్యాంపు కార్యాలయంలో మంగళవారం అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. కూకట్‌పల్లి ప్రాంతంలో డ్రైనేజీ, రోడ్లు, దోమల సమస్యలు ప్రజలను తీవ్రంగా వేధిస్తున్నాయని, వీటిపై అధికారులు పట్టించుకోకపోవడంపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఎంటమాలజీ సిబ్బంది తీరును మార్చుకోవాలని హెచ్చరించారు. బోనాల వేడుకల సందర్భంగా ఆలయ పరిసరాల్లో నెలకొన్న సమస్యలకు వెంటనే పరిష్కరించాలన్నారు. అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రణాళికలు రూపొందిస్తే నిధులు మంజూరు చేసేందుకు మంత్రులను కలుస్తానని చెప్పారు. ముందస్తుగా పెండింగ్‌లో ఉన్న పనులను యుద్ధప్రాతిపాదికన పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. అంతకు ముందు కూకట్‌పల్లిలోని హైటెన్షన్‌లైను రోడ్డులో డ్రైనేజీ, రోడ్డు సమస్యను పరిశీలించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కొనసాగుతున్న కూల్చివేతలు

అడ్డుకుంటే కేసులు నమోదు చేస్తాం: కమిషనర్

దుండిగల్, జూలై 2(ఆంధ్రజ్యోతి): దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని మల్లంపేట గ్రామంలో అనుమతులు లేకుండా చేపట్టిన నిర్మాణాలపై మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ, టీపీఓ సంజన ఆధ్వర్యంలో చేపట్టిన కూల్చివేతలు రెండో రోజూ కొనసాగాయి. బొల్లారం రోడ్డులో ప్రణీత్ ప్రణయ్‌కి సంబంధించిన భవనాన్ని జీ+2 పర్మిషన్ తీసుకొని ఐదు అంతస్తుల నిర్మాణం చేపట్టారు. అదే విధంగా అంబేడ్కర్ విగ్రహం ప్రక్కన దాదాపు ఐదొందల గజాల్లో శ్రీనివాస్‌రెడ్డి అనే బిల్డర్ పాత గ్రామ పంచాయతీ అనుమతుల పేరుతో ప్రధాన రహదారి ప్రక్కనే సెల్లార్‌తో ఆరు అంతస్తుల భవానాన్ని నిర్మించాడు. వీటి అన్నింటిపై ఫిర్యాదు వచ్చిన నేపథ్యంలో ఈ కూల్చివేతల చేపడుతున్నట్లు కమిషనర్ తెలిపారు. యంత్రాల సహాయంతో కూల్చివేతలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. మల్లంపేట గ్రామంలో ఈ అక్రమ నిర్మాణాల కూల్చివేతలు నిరంతరం కొనసాగుతున్నాయని, పనులకు ఎవరు అడ్డు వచ్చినా కేసులు నమోదు చేయిస్తానని కమిషనర్ సత్యనారాయణ హెచ్చరించారు.

● డీ పోచంపల్లిలో నిర్మాణాలను కూల్చొద్దు

దుండిగల్: దుండిగల్ మున్సిపాలిటీ డీ పోచంపల్లి సర్వే నెంబరు 156లో వెలిసిన అక్రమ నిర్మాణాలను అధికారులు కూల్చివేతలకు సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ నిర్మాణాలను ఎందుకు కూల్చివేస్తున్నారని రెవెన్యూ అధికారులను ప్రశ్నించారు. కూల్చివేతలు చేపట్టవద్దని ఆయన అధికారులను కోరారు.


మల్లంపేట రోడ్డులో అనుమతులు లేని భవనాన్ని కూల్చివేస్తున్న సిబ్బంది

పరిశ్రమల్లో చోరీ

- పట్టుకోవడానికి ప్రయత్నించిన సిబ్బంది
- వాహనాన్ని వదిలేసి పారిపోయిన దొంగలు
- రూ.8 లక్షల విలువైన సామగ్రి మాయం

పేట్‌బషీరాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల్లో దొంగతనానికి యత్నించిన ముగ్గురు దుండగులను పట్టుకునేందుకు ప్రయత్నించే లోపే పారిపోయారు. పేట్‌బషీరాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుత్బుల్లాపూర్‌లో నివాసం ఉంటున్న సత్యనారాయణ, నాగబాబులు దూలపల్లి పారిశామికవాడ రామిరెడ్డినగర్‌లో శ్రీదుర్గా ఇన్‌ఫ్రా కంపెనీ, మహాలక్ష్మి సిందూర్ ఎంటర్ ప్రైజెస్ పేర్లతో పరిశ్రమలు నిర్వహిస్తున్నారు. గతనెల 24, 30న పరిశ్రమల్లోని కాపర్ కేబుల్, వెల్డింగ్ మిషన్‌లు, డ్రైనింగ్ మిషన్‌లు, ఆక్సిజన్ ఎల్‌పీజీ సిలెండర్లు చోరీకి గురయ్యాయి. ఈనెల 1వ తేదీ రాత్రి టీఎస్ 13 ఈవై 6122 నెంబరు గల యాక్టివాపై ముగ్గురు వ్యక్తులు పరిశ్రమ వద్దకు వచ్చి సామగ్రిని దొంగిలించేందుకు ప్రయత్నించగా అక్కడే కాపుకాసిన ఆనంద్‌కుమార్, సోనూకుమార్, బిట్టు, మధులు వారిని పట్టుకునే ప్రయత్నం చేశారు. దీంతో ముగ్గురు దొంగలు యాక్టివాను అక్కడే వదిలేసి పారిపోయారు. ఆ తర్వాత పరిశ్రమ యాజమాన్యం సత్యనారాయణ, నాగబాబులు రూ.8 లక్షల విలువ చేసే సామగ్రి చోరీకి గురయిందని పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు పేట్‌బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దొంగల కోసం సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం ఇద్దరు వ్యక్తులు పరిశ్రమ దగ్గరకు వచ్చి పని ఉందా అని యాజమాన్యాన్ని అడగడానికి వచ్చారు. సీసీ కెమెరాల్లో గుర్తించిన వీరిని యాజమాన్యం మాటల్లో పెట్టి పేట్‌బషీరాబాద్ పోలీసులకు సమాచారాన్ని అందించారు. పోలీసులు వచ్చి ఇద్దరు దొంగలను అరెస్ట్ చేవారు.

యువకుడి ఆత్మహత్య


వెంకటసాయిరాం (ఫైల్)

హైదర్‌నగర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు, మానసిక సమస్యలతో బాధపడుతున్న ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కేపీహెచ్‌బీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడకు చెందిన కొత్త భానుశంకర్ వెంకటసాయిరాం(28) కేపీహెచ్‌బీ ఫేజ్-3 టెంపుల్ బస్టాప్ వద్ద ఓ గదిలో స్నేహితులతో కలిసి నివాసం ఉంటూ డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. కొంతకాలంగా ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నాడు. దీనికి తోడు ఇటీవల ఆర్థిక ఇబ్బందులు తోడవ్వటంతో సోమవారం రాత్రి గదిలో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్యహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు ఫిర్యాదు అందుకున్న పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఈత కొడుతుండగా ఫిట్స్

● చికిత్స పొందుతూ మృతి


సందీప్ (ఫైల్)

పేట్‌బషీరాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొడుతుండగా ఓ వ్యక్తికి ఫిట్స్ రావడంతో గమనించిన కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పేట్‌బషీరాబాద్ ఎస్ఐ రామ్‌నారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్ఆర్‌నగర్‌లో నివాసం ఉంటున్న సందీప్(41) కుటుంబసభ్యులతో కలిసి కొంపల్లి మున్సిపల్‌లోని డోలార్‌ధన్‌కి గతనెల 29న వెళ్లారు. మధ్యాహ్నం డోలార్‌ధన్‌లో భోజనం చేశారు. బాబు విష్ణు, సందీప్‌లు స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొడుతున్నారు. ఈ క్రమంలో సందీప్‌కు ఫిట్స్ రావడంతో భార్య పుష్ప గమనించి అతడిని బయటకు తీసి సుచిత్రాలోని ఓ ఆస్పత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతున్న సందీప్ పరిస్థితి విషమించడంతో మంగళవారం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పేట్‌బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకొన్నారు.


ఎంఏనగర్‌వాసులతో మాట్లాడుతున్న రవికుమార్‌యాదవ్

ఎంఏనగర్‌వాసులకు అండగా ఉంటాం

మియాపూర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మియాపూర్ పరిధిలోని ఎంఏనగర్‌వాసులకు బీజేపీ తరుపున తాము అండగా ఉంటామని శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇచ్‌చార్జి రవికుమార్‌యాదవ్ అన్నారు. మంగళవారం ఆయన ఎంఏనగర్‌లో పర్యటించారు. ప్రజలకు తాము అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ భూముల్లో 30 ఏళ్లుగా నివాసం ఉంటున్న పేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. హెచ్ఎండీఏ అధికారులు ఇళ్లు ఖాళీ చేయాలని నోటీసులు ఇచ్చి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొందరు రాజకీయ ప్రయోజనాల కోసం సర్వేనెంబర్ 100, 101లో ప్రభుత్వ భూమిని కబ్జా చేయాలని ప్రేరేపించిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాల్సింది పోయి పేదలకు నోటీసులు ఇవ్వడం సరికాదన్నారు. కాలనీవాసులకు తాము అండగా ఉండి వారి తరపున పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ రాఘవేంద్రరావు, నాయకులు నాగుల్‌గౌడ్, స్థానికులు మాన్యం, రవికాంత్, శ్రీను, గౌతమ్, ప్రవీణ్, క్రాశ్, వినోద్ పలువురు పాల్గొన్నారు.